క్లుప్తంగా

వెస్ట్ సర్కిల్ కార్యాలయం ఎస్పీ తనిఖీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు వెస్ట్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, కేసుల దర్యాప్తు, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు శ్రీధర్‌నాయుడు, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ నియమించారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాలోని రొంపిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించి తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పజెప్పారు.

పెనుమూరు తహసీల్దార్‌గా లోకేశ్వరి

పెనుమూరు తహసీల్దార్‌గా లోకేశ్వరిని నియమించారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు రూరల్ తహసీల్దార్‌గా ఉన్న ఆమెను పెనుమూరు మండలానికి బదిలీ చేశారు.

రికార్డు రూం తనిఖీ



రికార్డు రూం తనిఖీ చేస్తున్న డీఈ శేషాద్రి, డీఆర్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డు రూమ్‌ను మంగళవారం ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి, ఏఈ కేశవులు తనిఖీ చేశారు. మదనపల్లె ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) శ్రీనివాసరావు పేర్కొన్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం ఉందా అని చూశారు. సిబ్బంది గదిని దగ్గరుండి చూపించారు. గదికు సరఫరా అవుతున్న విద్యుత్ గురించి ఆరా తీశారు. నూతన కార్యాలయం నుంచి పాత కార్యాలయానికి విద్యుత్ సరఫరా చేస్తున్న వైర్‌ను మార్చుకోవాల్సిందిగా డీఈ సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వినోద్, ఎస్ఏ మేనక పాల్గొన్నారు.

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



కిటకిటలాడుతున్న అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: సాధారణంగా మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఖాళీగా ఉంటాయి. పెద్దగా రిజిస్ట్రేషన్లు జరగవు. కానీ అందుకు భిన్నంగా చిత్తూరు అర్బన్ కార్యాలయంలో సాధారణ రోజుల్లో జరిగే విధంగా డాక్యుమెంటేషన్లు జరిగాయి. ప్రతి రోజూ అర్బన్ కార్యాలయంలో 30–35 మధ్య డాక్యుమెంటేషన్లు జరుగుతుంటాయి. మంగళవారం అయితే పదిలోపు జరగడమే కష్టం. అయితే మంగళవారం అన్ని రకాల డాక్యుమెంట్లు కలిపి 32 జరిగాయి. రూరల్ కార్యాలయంలో రెండు మాత్రమే జరిగాయి.

పాఠశాల బస్సులు తనిఖీ



బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారులు పాఠశాల బస్సులను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఎంవీఐలు రాజేశ్వరరావు, దీపిక, నరసింహులుతో బస్సుల్లోని లోపాలను, రికార్డులను లోతుగా విచారించారు. ఎఫ్‌సీ లేకుండా తిరుగుతున్నవి, డీఎల్, ట్యాక్స్ పన్ను చెల్లించని 10 కేసులను తనిఖీల్లో గుర్తించారు. రూ.1,18,050 జరిమాన విధించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు హెచ్చరించారు. నగరంలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో మద్యం తాగి 11 మంది వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారికి రూ.10వేల చొప్పున రూ.1,10,000 జరిమానా విధించారు. 9 నెలల వ్యవధిలో 250 మందికి రూ.18.9 లక్షల జరిమానా విధించామని సీఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

శునకాలు జాగ్రత్త!

- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో వీధి కుక్కల వీరంగం
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- చర్యలు తీసుకోని అధికారులు



గుంపుగా ఉన్న కుక్కలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని బండపల్లి మార్గంలో రెండు రోజుల క్రితం రాత్రి వేళ పనిముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిని రైల్వేట్రాక్ సమీపంలో కుక్కలు దాడి చేశాయి. దీంతో ఒక్కసారిగా బండిని వదిలేసి ప్రాణభయంతో పరుగులు తీశాడు. అయినా వెంటపడుతున్న కుక్కలను ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహన దారుడు గమనించి రక్షించాడు. లక్ష్మీనగర్ కాలనీ వద్ద కూడా సురేష్ అనే యువకుడిపై కుక్కదాడి చేసి గాయపరిచింది. ఇలా ఈ రెండు చోట్లే కాదు కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

మొరిగే కుక్క కరవదని అంటారు. అది ఒకప్పటి మాట. ఇప్పుడు మొరగని కుక్కతో పాటు మొరిగే కుక్క సైతం పిక్కలు పట్టుకుని పీకుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెంటాడి కరుస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దాడిచేస్తున్నాయి. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో గడిచిన మూడు (మే, జూన్, జూలై, ఆగస్టు) నెలల్లో 800లకుపైగా కుక్కకాట్లు నమోదయ్యాయి. కాగా చిత్తూరులో 5వేలకుపైగా వీధికుక్కలు, పూతలపట్టులో 4,500లకుపైగా కుక్కలున్నట్లు పశువర్ధకశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు.

ప్రజలు బెంబేలు..

రెండు నియోజకవర్గాల్లో పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కల సంతతి గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో రాత్రి అయ్యేసరికి రోడ్డు మీద ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. వీధి కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు నామ మాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇటీవల రేబిస్ టీకాలు పెంపుడు కుక్కలకు మాత్రమే వేసి.. వీధి కుక్కలను గాలికి వదిలేశారు. దీంతో తరచూ గ్రామ సింహాల దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కుక్కలు దాడి చేస్తాయిలా..

కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శతవిధాలా ప్రయత్నిస్తారు. మరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. కుక్కల ఎత్తుకు పెద్దవారికైతే కాలి పిక్కలు పట్టి లాగుతాయి. పిల్లల ఎత్తుకు శునకాలు సమాంతరంగా ఉండడంతో ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తాయి. కాటేసిన శరీర భాగం, గాయం లోతు ఆధారంగా చికిత్సకు సిఫార్సు చేస్తారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా పురపాలిక, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో టీకాలు ఇప్పించే కార్యక్రమాలు నిర్వహించాలి.
- వీధుల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదు.
- నియంత్రణకు స్థానిక సంస్థలు పశు సంవర్థక శాఖతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలి.
- కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచాలి.

నిర్లక్ష్యం వద్దు...



కుక్కకాటును నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. కరిచిన వెంటనే సమీప ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స చేయించుకుని టీకా వేయించుకోవాలి. ఇటీవల కుక్కల బెడద కొన్నిచోట్ల ఎక్కువైంది. ప్రజలు సాధ్యమైనంతవరకు వాటికి దూరంగా ఉండాలి. కుక్కల దాడుల్లోనూ నాలుగు రకాలు ఉంటాయి. అందులో నాకడం, గోకడం, కరవడం, గాయం చేయడం వంటివి ప్రమాదం, బాధితులకు టీకా వేస్తే ఉపశమనం కలుగుతుంది. 3, 7, 28 రోజుల్లో టీకా తప్పనిసరిగా వేసుకోవాలి.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించి మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారి నుంచి దూరంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకల–2లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 70 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల ముందు మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఉంచి విక్రయించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జ్వరం వరుసగా రెండు రోజుల పాటు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్యం పొందాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌ను కలిసిన వైద్యులు





తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వైద్యులు, తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నవీన్‌కుమార్

గుడిపాల: గుడిపాల మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్‌లు సంధ్య, చంద్రమహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే వెంగమాంబపురం సర్పంచ్ నవీన్‌కుమార్ తహసీల్దార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పోటీల్లో పాల్గొంటే దేశభక్తి పెంపొందుతుంది



సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వల్ల దేశభక్తి పెంపొందుతుందని పీవీకేఎన్ ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఆజాదీ కా అమృత్ దినోత్సవ్‌ను పురస్కరించుకుని పీవీకేఎన్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భవిష్యత్ భారత నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు గోపీనాయక్, చెన్నకేశవులు, రేఖ పాల్గొన్నారు.

సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో..

నగరంలోని గిరింపేటలో ఉన్న సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.మనోహర్ మాట్లాడుతూ ఇంటింటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తమ దేశభక్తిని చాటిచెప్పాలని సూచించారు. ప్రొఫెసర్లు డా.ఉషారాణి, షమ్స్ అక్తర్, తిరుకుమరన్ పాల్గొన్నారు.



పీవీకేఎన్ కళాశాలలో..

హమాలీల ధర్నా

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్ ఎదుట హమాలీలు మంగళవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో హమాలీల కాంట్రాక్ట్‌ను ది ఎలక్ట్రిసిటీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కాకుండా కాంట్రాక్టర్‌కు టెండర్ ద్వారా ఇవ్వడం సరికాదన్నారు. అక్కడ గత 13 సంవత్సరాలుగా ఎలక్ట్రిసిటీ అసోసియేషన్ వారికి మాత్రమే టెండర్లు ఇచ్చేవారన్నారు. దీంతో స్థానికంగా ఉండే హమాలీలు పనిచేసుకుంటూ అలానే కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌ను కాదని కాంట్రాక్టర్‌కు టెండర్ ఇవ్వడంలో మతలబు ఏమిటన్నారు. అతను పాత హమాలీలను తొలగించి కొత్తవారిని తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈ విధానాన్ని నెమ్మదిగా డిస్కం పరిధిలోని ఐదు జిల్లాలకు వర్తింప చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారని విమర్శించారు. పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, నేతలు గంగరాజు, శివ, ఆనంద, గంగాధర పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యానికి భరోసా

- నగర పాలక కార్మికుల కళ్లకు పరీక్షలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం కార్మికులకు మంగళవారం చిత్తూరు ప్రభుత్వ బోధన ఆస్పత్రిలో ప్రత్యేక నేత్ర చికిత్సలు చేయించారు. కమిషనర్ జె.అరుణ ఆస్పత్రికి వెళ్లి వైద్య చికిత్సలు అందుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. నగరపాలక పరిధిలోని కార్మికులకు ఆగస్టు 2, 3వ తేదీల్లో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్మికులకు నిర్వహించిన నేత్ర పరీక్షల్లో 19 మందికి కంటికి సంబంధించిన సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి మంగళవారం చిత్తూరు ప్రభుత్వ బోధనా ఆస్పత్రి కంటి విభాగంలోని కంటి వైద్యుల చేత ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌ఓ డా.అనిల్‌కుమార్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. ఉమా ఐకేర్, ఆర్థో, డయాబెటిస్ హాస్పిటల్ సహకారంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యాంపు జరుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని భక్తులు, ఆలయ సిబ్బంది, చుట్టుపక్కల గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రక్తపరీక్షలు కచ్చితంగా చేయాలి



పాపసముద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

గుడిపాల: జ్వరంతో వచ్చిన రోగులకు కచ్చితంగా రక్తపరీక్షలు చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతి తెలిపారు. మంగళవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఓపీలో వచ్చే పేషెంట్లకు అన్ని విధాలుగా సౌకర్యాలు ఉండే విధంగా చూడాలన్నారు. రక్తపరీక్షలు చేసే గదిని పరిశీలించారు. అనంతరం పాపసముద్రం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గ్రామాల్లో వైద్యసేవలు ఎలా అందిస్తున్నారని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సంధ్య, చంద్రమహేష్ పాల్గొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో మంగళవారం ఫిజియోథెరపీ బిజినెస్ ఫర్ ఫిజియో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విధానాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పార్థిబన్ రామస్వామి ఫిజియోథెరపిస్ట్ వృత్తిని ఆసక్తిగా మార్చుకోవడం, ప్రత్యేకమైన సేవలు, నైపుణ్యం కలిగిన బృందాన్ని ఏర్పరచుకోవచ్చునన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లను ఘనంగా సత్కరించారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



విజయలక్ష్మి(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త విజయలక్ష్మి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. గత కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మంగళవారం విజయలక్ష్మి మృతదేహాన్ని ఐసీడీఎస్ సిబ్బంది, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి



బంగారుపాళెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం బంగారుపాళెంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు.

వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో..

మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు జాతీయ జెండాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మీరాబాయి మాట్లాడుతూ దేశభక్తి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మెలగాలని ఆమె సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ నేతలు నివాళులర్పించారు. మంగళవారం గంగినేని చెరువు సమీపంలో గల విగ్రహాన్ని శుభ్రం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు శ్రీనివాసులు, షణ్ముగం పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలుగు ఆధ్వర్యంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య సభ్యులు మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సమాఖ్య సభ్యులు పుర వీధుల్లో తిరుగుతూ ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగుర వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని సుచించారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, పెద్దసంఖ్యలో మహిళా సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.



బంగారుపాళెం: ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు



తవణంపల్లెలో అవగాహన ర్యాలీ



ర్యాలీలో డ్వాక్రా మహిళలు

దేశభక్తిని పెంపొందించుకోవాలి

పూతలపట్టు(యాదమరి): మండలంలోని ప్రతి మహిళా దేశభక్తిని పెంపొందించుకోవాలని ఏపీఎం కల్పలత తెలిపారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, లీడర్లు, సీసీలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎం కల్పలత మాట్లాడుతూ మండలంలోని ప్రతి మహిళా స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న దేశ నాయకుల వివరాలను గ్రామంలోని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీలు, లీడర్లు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసిన యూటీఎఫ్, ఎస్టీయూ సంఘ నేతలు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు టీచర్ల డిమాండ్లను పరిష్కరించాలంటూ మంగళవారం యూటీఎఫ్, ఎస్టీయూ సంఘ నేతలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. టీచర్ల డిమాండ్ల పరిష్కారం కోసం డీఈఓ దేవరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జీవీ రమణ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా జిల్లా పరిషత్ పీఎఫ్ అసంబద్ధంగా నిర్వహిస్తున్నారు. పీఎఫ్ వివరాలను క్రమబద్ధీకరించి చందాదారులకు నెలవారీ జమలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల స్థలాలు అన్యాక్రాంతానికి లోనుకాకుండా సర్వే చేయించి హద్దులు గుర్తించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలకు మోక్షం కల్పిస్తాం..

పీఎఫ్ సమస్యలకు మోక్షం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ తెలిపారు. ఎస్టీయూ సంఘ నాయకులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ జాబితాల తయారీకి విద్యాశాఖలో ఉన్న సిబ్బందితో పాటు కంప్యూటర్‌పై పట్టు ఉన్న కొద్ది మంది టీచర్ల సహకారం తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారన్నారు. రివర్షన్ కోరుకుంటున్న టీచర్లకు కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం, దేవరాజులురెడ్డి పాల్గొన్నారు.

భాషా పండితులకు న్యాయం చేయాలి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న వినాయకం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో భాషా పండితులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా డీఈఓ పూల్‌లో ఉన్న భాషా పండితులు ఉద్యోగోన్నతులు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. డీఈఓ పూల్‌లో ఉన్న భాషా పండితులకు న్యాయం చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు.

పొదుపు పథకాలపై కళాజాత



పోస్టల్ పొదుపు పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో మంగళవారం పోస్టల్ పొదుపు పథకాలపై ఆ శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టల్ అధికారులు గిరి, సిద్ధయ్య మాట్లాడుతూ జిల్లా తపాలా శాఖ అధికారులు లక్ష్మయ్య, విద్యావతి ఆదేశాల మేరకు గ్రామాల్లో పొదుపు పథకాలపై గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తపాలాశాఖ ద్వారా అందిస్తున్న పొదుపు పథకాలు, తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ వచ్చే పథకాలను గురించి వివరించారు. పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమణబాబు, కళాజాత టీం సభ్యులు దుర్గాప్రసాద్, గోపి, తిరుపతి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్యం



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మైనగుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భవతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రసవాలు చేయిస్తున్నట్లు వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.